శాస్త్రోక్తంగా లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, ఏప్రిల్17: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి నిత్య తిరుకల్యాణోత్సవం బుధవారం శాస్త్రోక్తంగా సాగింది. ఉదయం స్వామివారికి సుదర్శన నారసింహహోమం జరిపిన అర్చకులు కల్యాణమూర్తులకు గజవాహన సేవ నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో తూర్పు అభిముఖంగా స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణోత్సవం జరిపారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వయంభూ నారసింహుడిని దర్శించుకున్నారు. స్వామివారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వయంభూ నారసింహుడిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారికి సువర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి సేవోత్సవం, దర్బార్ సేవలో భక్తులు పాల్గొన్నారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటకంగా సాగాయి. స్వామివారిని సుమారు 7 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 12,15,058 ఆదాయం సమకూరిందని ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

అడ్డగూడూరులో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

'ప్రశాంత్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి'

అడ్డగూడూరు, ఏప్రిల్ 17: భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని మృతి చెందిన చిన్నలచ్చి ప్రశాంత్ కుటుంబానికి ప్రభుత్వం రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియాను వెంటనే ప్రకటించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు ఉప్పుల శాంతికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల ఆర్‌సీఓ రజినిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు చెరుకు శివరాజ్, రాకేశ్, సంతోష్, ధనుష్, నరేశ్ పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

చౌటుప్పల్ : భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తీసుకొని మృతి చెందిన భూదాన్‌పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన చిన లచ్చి ప్రశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ యువజన నాయకుడు ఉప్పు కృష్ణా బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం తోపాటు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంస్థ అధ్యక్షుడు సీత భాస్కర్

ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 17 : పట్టణ కేంద్రంలో బోధి ధర్మ యోగ అండ్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సీత భాస్కర్, యోగా శిక్షకురాలు కొయ్యడ సంధ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసోసియేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విడం రామనాథం, ప్రధాన కార్యదర్శి చింతకింది కిరణ్, సహాయ కార్యదర్శులు కేమ విష్ణుమూర్తి, సీతా కృష్ణ, కోశాధికారి కొండమడుగు మల్లేశ్, సహాయ కోశాధికారి కడవేరు శేఖర్, ప్రచార కార్యదర్శి దోర్నాల రత్నం, కార్యవర్గ సభ్యులు సిరిమల్లె పరమేశ్ పాల్గొన్నారు.

యజ్ఞంలో పాల్గొన్న తడక శంకర్, భక్తాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు

యాగశాల ప్రారంభం

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 17 : పట్టణ కేంద్రంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన యాగశాలను చేనేత సంఘం నాయకుడు తడక శంకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ధ్వజారోహణం, ప్రత్యేక పూజలు నారాయణ హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. దేవాలయ అధ్యక్షుడు కడవేరు వెంకటేశ్, ఉపాధ్యక్షుడు బోగ విజయ్, ప్రధాన కార్యదర్శి సీతా కృష్ణ, కోశాధికారి దోరనాల కరుణాకర్, ధర్మకర్తలు ముసునూరి యాదగిరి, సకినాల జయమ్మ, వలందాస్ శోభ, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పూర్తిగా నిండి అలుగు పోస్తున్న భూదాన్‌పోచంపల్లి పెద్ద చెరువు

మండుటెండల్లో జలకళ

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 17 : భూదాన్ పోచంపల్లి పెద్ద చెరువు పూర్తి స్థాయిలో నిండి అలుగు పోస్తున్నది. ప్రస్తుత జిల్లాలో ఎండలు మండుతూ.. 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుండడంతో చాలా వరకు చెరువులు ఎండిపోయాయి. అయినా పోచంపల్లి చెరువు జలకలను సంతరించుకొని చూపరులను ఆకట్టుకుంటున్నది. మూసీ నది నుంచి పిలాయిపల్లి, పెద్దగూడెం, జూలూరు, కప్రాయిపల్లి, గౌస్కొండ, ముక్తాపూర్ గ్రామాల మీదుగా పోచంపల్లి వరకు పారుతున్న కాల్వ ద్వారా వస్తున్న నీటితో చెరువు పూర్తిస్థాయిలో నిండింది. ఈ చెరువు కింద సుమారు 700 ఎకరాల భూములు సాగులోకి వస్తున్నాయి.

వైభవంగా సీతారాముల కల్యాణం

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు

భూదాన్‌పోచంపల్లి : శివారెడ్డిగూడెంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి



వలిగొండ : సంగెంలో సీతారామ కల్యాణంలో పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 17 : శ్రీరామనవమి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాల ప్రాంగణంలో ప్రత్యేకంగా మంటపాలను ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తుల సమక్షంలో సీతారాముల కల్యాణ వేడుకలు కనుల పండువగా జరిగాయి. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. భువనగిరిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మల, జడ్పీటీసీ సభ్యుడు సుబ్బూరు బీరుమల్లయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, నాయకులు ఎడ్ల వెంకట్‌రెడ్డి, ర్యాకల శ్రీనివాస్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్మన్ ప్రత్యేక పూజలు

వలిగొండ : మండలంలోని సంగెం గ్రామంలోని సీతా రామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మండల కేంద్రంలో నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. దుప్పెల్లి గ్రామంలో భక్తులకు బాబు జమాల్ ఫౌండేషన్ సభ్యుడు జావిద్ మజ్జిగ, మంచినీటిని పంపిణీ చేశారు. వేడుకలల్లో ఎంపీపీ నూతి రమేశ్‌రాజ్, భక్తులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని మార్కండేశ్వరస్వామి, లక్ష్మీనారాయణస్వామి, భక్తాంజనేయస్వామి ఆలయాలతో పాటు కనుముక్కల, జూలూరు, పెద్దగూడెం, శివారెడ్డిగూడెం, రేవనపల్లి, వంకమామిడి, జలాల్‌పూర్ గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. శివారెడ్డిగూడెంలో జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, జడ్పీటీసీ కోట పుష్పలతామల్లారెడ్డి, ఎంపీటీసీ బత్తుల మాధవీశ్రీశైలంగౌడ్, మాజీ సర్పంచ్ రామ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బొడ్డుగూడెంలో ఎమ్మెల్యే పూజలు

అడ్డగూడూరు : మండలంలోని బొడ్డుగూడెం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో శ్రీరామనవమి వేడుకలు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు లింగయ్యయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణకేంద్రంలోని సీతారామ చంద్రస్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం, స్వామి వారి ఊరేగింపు చేపట్టారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, పుష్పగిరి శారదా లక్ష్మీనృసింహ పీఠం మహాస్వామి నృసింహ భారతి, ఆలయ చైర్మన్ బొబ్బిళ్ల మురళి, ధర్మకర్తలు శ్రీలతా శ్రీనివాస్‌చారి, చంద్రశేఖర్, వెంకటేశం, నర్సింహ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట దేవస్థాన అనుబంధ రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో సీతారామ కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

గుట్టలో సీతారామచంద్రస్వామి కల్యాణం

యాదగిరిగుట్ట, ఏప్రిల్17: యాదగిరిగుట్ట ఆలయ అనుబంధ పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సీతారామచంద్ర స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల విందుగా నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాలం, మధ్యాహ్న పూజల అనంతరం సీతారామచంద్రస్వామిని దివ్య మనోహరంగా అలంకరించి శివాలయ తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం కల్యాణ మండపంలో వేంచేపు చేసి కల్యాణ క్రతువును నిర్వహించారు. మొదట విఘ్నేశ్వర సంకల్పం, పూజలు జరిపారు. సీతారామచంద్రుడి పాదపక్షాళన చేసిన అనంతరం కన్యాదాన తంతును నిర్వహించారు. వధూవరులు శ్రీరామచంద్ర స్వామి, సీతాదేవి అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ఆలంకరించే కార్యక్రమం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 1.15 గంటల అభిజిత్ లగ్న సుముహూర్తానికి మాంగల్యధారణ చేశారు. స్వామి వారి కల్యాణవైభవాన్ని ఆలయ ప్రధానార్చకుడు నల్లన్ ధీఘశ్ లక్ష్మీనరసింహాచార్యులు భక్తులకు వివరించారు. అనంతరం చతుర్వేద పారాయణం, ఆశీర్వచనం చేసి స్వామివారి నివేదన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్ రావు, డీఈఓ దోర్బాల భాస్కర్‌శర్మ, శివాలయ ప్రధానార్చకుడు గౌరీభట్ల నర్సింహ్మరాములు శర్మ, ప్రధాన పురోహితుడు గౌరీభట్ల సత్యనారాయణ శర్మ, ఏఈఓ జూశెట్టి కృష్ణ, పర్యవేక్షకుడు చంద్రమౌళి, పురోహితులు నాగరాజు శర్మ, శ్రీధర్‌శర్మ, శ్రీనివాస శర్మ ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

అడ్డగూడూరు : బొడ్డుగూడెంలోని హనుమాన్ ఆలయంలో శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మందుల సామేల్

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రూ.15.50 లక్షలతో ఉడాయించిన క్యాషియర్

- స్టేట్ బ్యాంక్ ఆఫ్ వలిగొండ బ్రాంచ్‌లో ఘటన

వలిగొండ, ఏప్రిల్17: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ వలిగొండ బ్రాంచ్ క్యాషియర్ రూ.15.50 లక్షలు మాయం చేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ వలిగొండ బ్రాంచ్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న కాలేరు అనిల్‌కుమార్ మంగళవారం ఉదయం 10 గంటలకు విధులకు హాజరయ్యాడు. 11 గంటల సమయంలో అధికారులకు సమాచారం ఇవ్వకుండా బ్యాంక్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బ్యాంక్ మేనేజర్ మౌనిక అతడికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దాంతో బ్యాంక్ మేనేజర్ సిబ్బందితో కలిసి క్యాష్ కౌంటర్‌లోని డబ్బులను లెక్కించగా రూ.15.50 లక్షలు తక్కువగా వచ్చాయి. బ్యాంక్ డబ్బులను తీసుకొని ఉడాయించిన క్యాషియర్ అనిల్‌కుమార్‌పై మేనేజర్ మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

సర్వాయి పాపన్న కార్మిక సంఘం మండలాధ్యక్షుడిగా పాండు

రాజాపేట, ఏప్రిల్ 17 : సర్వాయి పాపన్న కార్మిక సంఘం మండలాధ్యక్షుడిగా మండలంలోని కాల్వపల్లికి చెందిన కళ్లెం పాండును నియమించారు. బుధవారం రాజాపేట మండల కేంద్రంలో సంఘం యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు పరిటాల రవికుమార్‌గౌడ్ నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బడిగే పెంటయ్యగౌడ్, నెమిలే మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



పాండుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న సంఘం యువజన జాతీయ అధ్యక్షుడు రవికుమార్‌గౌడ్

21న మోత్కూరులో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

మోత్కూరు, ఏప్రిల్17: భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ సన్నాహక సమావేశాన్ని ఈ నెల 21న మోత్కూరులో నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సమావేశానికి మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త బూడిద భిక్షమయ్యగౌడ్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

విద్యుదాఘాతంలో మహిళ మృతి

రాజాపేట, ఏప్రిల్ 17 : విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని కాల్వపల్లిలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాకల్ల చంద్రకళ (55) తన ఇంట్లో నీటి సంపు వద్ద ఉన్న మోటర్‌ను సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా దవాఖాన తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఎద్దు దాడిలో గాయపడ్డ వ్యక్తి మృతి

నాగారం, ఏప్రిల్ 17 : ఎద్దు దాడిలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందాడు. నాగారం మండలం వర్ధమానుకోట గ్రామానికి చెందిన నర్సిరెడ్డి (53) ఈ నెల 10న గడ్డిమోపు తీసుకుని వస్తుండగా ఆ సమయంలో ఎద్దు వెనుక నుంచి వచ్చి పొడిచింది. దాంతో నర్సిరెడ్డి మెడకు తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. తల్లి భద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాల్లో జాగ్రత్త

- హద్దు మీరితే జైలుకే
- పోస్ట్ చేసిన వ్యక్తి, అడ్మిన్ ఇద్దరూ బాధ్యులే

హుజూర్‌నగర్, ఏప్రిల్ 17 : చేతిలో స్మార్ట్‌ఫోన్.. ఇంకేముంది ఇష్టం వచ్చినట్లుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడతామని అనుకుంటున్నారా ? అయితే మీరు చిక్కుల్లో పడక తప్పదు. మత, రాజకీయ, వ్యక్తిగత అంశాలకు సంబంధించి ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి పోస్టులు పెట్టినా పోలీసు కేసులను ఎదుర్కోవాల్సిందే. జైలు ఊచలు లెక్క పెట్టాల్సిందే. సాధారణ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సామాజిక మాధ్యమ పోస్టింగ్‌లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల వేళ ప్రత్యర్థి పార్టీల నాయకులు, అభ్యర్థులు పరస్పరం తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకునే అవకాశం ఉన్నది. ఆయా పార్టీలకు సోషల్ మీడియా విభాగాలున్నాయి.

అడ్మిన్లదే పూర్తి బాధ్యత

- సామాజిక మాధ్యమ గ్రూప్‌ల్లో ముఖ్యంగా వాట్సాప్‌లో అభ్యంతరకర, విద్వేషాలను రెచ్చగొట్టేలా గ్రూపులోని సభ్యులెవరూ పోస్టులు పెట్టినా అడ్మిన్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది
- అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిని గ్రూపు నుంచి తొలగించడంతో పాటు సదరు పోస్టును సైతం వెంటనే తొలగించాలి
- గతంలో కేవలం పోస్టు చేసిన వారు మాత్రమే దాన్ని తొలగించే అవకాశముండగా ప్రస్తుతం గ్రూపులోని ఏ సభ్యుడు పెట్టిన పోస్టు అయినా అడ్మిన్ తొలగించే వీలున్నది.
- గ్రూపులో కొత్త సభ్యులను చేర్చుకునే ముందు వారి అనుమతి తీసుకోవడంతో పాటు తప్పుడు పోస్టులు పెట్టిన వారిని తొలగించి పోలీసులకు సమాచారం అందించాల్సిన బాధ్యత కూడా అడ్మిన్‌దే
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే తప్పుడు పోస్టులపై ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా పోలీసులు సుమోటోగా కేసులు నమోదు చేసే అవకాశం ఉన్నది
- ఎన్నికల వేడి రాజుకుంటున్న నేపథ్యంలో ప్రత్యర్థులను అవమాన పరిచేలా, తమ అభ్యర్థి గొప్పతనాన్ని వివరిస్తూ పోస్టులు పెట్టే అవకాశం ఉన్నది.
- ప్రత్యర్థులను కించపరిచే వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు, ఫొటోలు మార్ఫింగ్, వాయిస్ మేసేజ్‌లు, వాస్తవ విరుద్ధంగా పోస్టులు పెట్టినా, వాటిని షేర్ చేసినా, వాటికి మద్దతు తెలుపుతూ కామెంట్లు చేసినా చట్టరీత్యా శిక్షలు తప్పవు
- తమ అనుమతి లేకుండా గ్రూపులో చేర్పుకునే అవకాశం లేకుండా వాట్సాప్‌లో ప్రత్యేక ఆప్షన్‌ను సెల్‌ఫోన్ వినియోగదారులు ఎంచుకోవడం ఉత్తమం

ప్రశాంత్‌కు అంతిమ వీడ్కోలు

- జిబ్లక్‌పల్లి గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు

ప్రశాంత్ మృతదేహాన్ని చూసి విలపిస్తున్న తల్లిదండ్రులు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 17 : భువనగిరిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థి చిన్నలచ్చి ప్రశాంత్(12) అంత్యక్రియలు బుధవారం సాయంత్రం మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రశాంత్ భువనగిరి గురుకులంలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 11న గురుకుల హాస్టల్‌లో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యాడు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రెయిన్‌బో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రశాంత్ మంగళవారం రాత్రి మృతి చెందాడు. విద్యార్థి మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం అదే రోజు రాత్రి గాంధీ ఆస్పత్రికి తరలించారు. పలు ప్రజా సంఘాల నాయకులు ఆస్పత్రికి చేరుకొని ప్రశాంత్ మృతికి నిరసన తెలిపారు. అయితే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అంబులెన్స్‌లో బుధవారం సాయంత్రం 6;30 గంటలకు జిబ్లక్‌పల్లి గ్రామానికి తీసుకొచ్చారు. మృతుడి ఇంటి వద్ద ఉదయం నుంచే బంధువులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున చేరుకొన్నారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి 7 గంటలకు పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంత్ అంత్యక్రియలు జరిగాయి. పోచంపల్లి, నారాయణపురం ఎస్ఐలు భాస్కర్‌రెడ్డి, జగన్ ఆధ్వర్యంలో 30 మంది పోలీసులతో గ్రామంలో బందోబస్తు నిర్వహించారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా

మృతుడి కుటుంబానికి అండగా ఉంటానని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ బుధవారం ఉదయం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబానికి రూ.4 లక్షల ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. దహన సంస్కారాల కోసం ప్రభుత్వ పరంగా రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని అధికారులు అందించారు.

మిన్నంటిన రోదనలు

తమ కుమారుడు మంచిగ చదువుకొని ఉన్నత స్థానానికి ఎదుగాలని భువనగిరి గురుకులంలో చేర్పిస్తే.. తమ కొడుకు ప్రాణాలు తీశారంటూ తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు అక్కడున్న వారిని సైతం కంటతడి పెట్టించింది. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్లే తమ కొడుకు చనిపోయాడని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కొని తమను ఆదుకోవాలని విద్యార్థి ప్రశాంత్ తల్లిదండ్రులు చిన్నలచ్చి మహేశ్, పారిజాత కోరారు.

మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 17 : మేళ్లచెర్వులోని మైహోం సిమెంట్ పరిశ్రమలో జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రెసిడెంట్ వర్క్స్ యూనిట్ హెడ్ ఎన్.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ అగ్నిమాపక అధికారులు చేసిన సూచనలు కార్మికులు తప్పనిసరిగా పాటించాలన్నారు. వేసవికాలం దృష్ట్యా అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్నిప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది, సంస్థ జనరల్ మేనేజర్ డాక్టర్ నాగేశ్వర్‌రావు, సేఫ్టీ అధికారులు సూర్యనారాయణ, వేణునాయుడు, ఫైర్ ఆఫీసర్ లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.